

# విభారె

**తెలుగు దినపత్రిక**

**VIBHARE TELUGU DAILY**







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 05-02-2026 సంపుటి : 07 సంచిక 262 పేజీలు : 8 వెల : రూ 3-00




# లోక్‌సభ మళ్లీ వాయిదా..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 04: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో బుధవారం సైతం సభ పలుమార్లు వాయిదా పడింది. ఈరోజు ఉదయం సభ ప్రారంభమైన వెంటనే భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చి జరగాలంటూ విపక్ష పార్టీల సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో మధ్యాహ్నం 12.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.విపక్ష సభ్యులంతా పార్లమెంట్ మెట్ల మీదకు చేరుకుని.. ప్లకార్డులు పట్టుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఇక పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకర్లతో మాట్లాడుతూ.. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాసిన లేఖకు తాము సమాధానం ఇచ్చామన్నారు. కానీ ఆయన ఏకపక్షంగా మాట్లాడుతున్నారంటూ రాహుల్ తీరుపై కిరణ్ రిజిజు మండిపడ్డారు. సభ 12.00 గంటలకు ప్రారంభమైంది. సభలో సభ్యుల తీరు మారలేదు. భారత్, అమెరికా ఒప్పందంపై కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ మధ్యాహ్నం 2.00 గంటలకు సభలో సమాధానం ఇస్తారని ప్రకటించిన అనంతరం సభను వాయిదా వేశారు.మళ్లీ సభ ప్రారంభమైన అనంతరం భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై సభలో మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడారు. విపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ప్లకార్డులు ప్రదర్శించారు. దాంతో సాయంత్రం 5.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.మరోవైపు రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోదీ ఈ రోజు అంటే.. బుధవారం లోక్‌సభలో ధన్యవాదాలు తెలపనున్నారు. లోక్‌సభలో ఈ రోజు ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఇంకోవైపు ప్రధాని సభకు వస్తే.. ఆర్మీ మాజీ చీఫ్ నరవణె రాసిన పుస్తకాన్ని ఆయనకు తాను స్వయంగా అందజేస్తానని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఆ పుస్తకాన్ని పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీ ప్రదర్శించారు. ప్రధాని మోదీ భయపడ్డారని.. ఈ రోజు ఆయన సభకు రారంటూ రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు.నరవణె పుస్తకంలోని అంశాలపై చర్చించాలంటూ మంగళవారం నాడు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఆయనకు మద్దతుగా 8మంది ఎంపీలు స్పీకర్ ఎదుట నిరసనకు దిగారు. ఆ క్రమంలో కాగితాలను చింపి స్పీకర్‌పైకి వారు విసిరారు. ఈ నేపథ్యంలో సదరు ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది.

# 2026-27 ఏపీ బడ్జెట్.. పయ్యావుల కీలక చర్చలు..

## వాటిపైనే స్పెషల్ ఫోకస్



అమరావతి, ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆర్థిక మంత్రి వరుసగా ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు శాఖలకు చెందిన మంత్రులతో సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు.సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది.రోడ్ల అభివృద్ధిపైనా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

# అనుమతి లేకున్నా.. గుంటూరుకు జగన్.. భారీగా ట్రాఫిక్ జామ్..




గుంటూరు, ఫిబ్రవరి 4: మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి మంది మార్బలంతో గుంటూరుకు బయలుదేరారు మాజీ సీఎం. ఈ క్రమంలో గుంటూరు – విజయవాడ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో కనీసం అంబులెన్స్‌లకు కూడా దారి లేకుండా పోయింది. ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ట్రాఫిక్ ఇబ్బందులపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అయితే గతంలో పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో జగన్ పర్యటనల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలీసు ఆంక్షలు విధించారు. ఎడ్లపాడు జాతీయ రహదారిపై వైసీపీ నేతల వాహనాలను పోలీసులు నిలిపివేస్తున్నారు. గుంటూరులో జగన్ పర్యటనకు వెళ్లకుండా ఆంక్షలు పెట్టి, పలువురు వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వైసీపీ కేడర్ తరలివెళ్తోంది.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు..

## బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్



న్యూఢిల్లీ: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు.జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు జైషే ఉగ్రవాదుల హతం..

ఉదంపూర్: జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో బుధవారం నాడు ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాక్‌కు చెందిన ఇద్దరు జైషే మమ్మద్ ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిలో ఒకరిని ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా చురుకుగా పనిచేస్తున్న 'జైషే' టాప్ కమాండర్ అవు మావియాగా, మరొకరిని జబ్బర్ అనే ఉగ్రవాదిగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. 'కియా' పేరుతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టగా, ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.అధికారుల సమాచారం ప్రకారం, జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం అందడంతో భద్రతా దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మిలిటెంట్లు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పారిపోయారు. నిఘా డ్రోన్ వారిని ఒక గుహలో దాక్కున్నట్టు గుర్తించడంతో భద్రతా బలగాలు చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.గుహ మొదట్లో ఒక ఉగ్రవాది, గుహలోపల మరొక ఉగ్రవాది మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు.





# సంపాదకీయం

గురువారం 05-02-2026

## అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది. భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి. అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది. అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు. అయితే, మూడీస్ విశ్లేషణ ప్రకారం, భారత్ ఈ మార్పును నెమ్మదిగా అమలు చేస్తుంది, ఎందుకంటే తక్షణ మార్పు భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ ఒప్పందం ఆభరణాలు, రత్నాలు, టెక్స్‌టైల్ వంటి రంగాలలో భారత ఎగుమతులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ఎందుకంటే అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. డీల్ ప్రకటన తర్వాత, స్టాక్ మార్కెట్లో జోరు కనిపించింది. నిఫ్టీ దాదాపు 3 శాతం పెరగగా, రూపాయి బలపడి డాలర్‌కు 90.40 వద్దకు చేరుకుంది. భారత్ వాణిజ్య శాఖ గడిచిన 12 నెలల్లో అత్యంత చురుగ్గా వ్యవహరించింది. అమెరికాతో కుదిరిన తాజా ఒప్పందానికి కొద్ది రోజుల ముందే భారత్, యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసింది. ఒకే సంవత్సరంలో ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులతో కుదుర్చుకోవడం భారత ఆర్థిక చరిత్రలో ఇదే తొలిసారి. వీటితోపాటు బ్రిటన్, ఓమన్, న్యూజిలాండ్‌తో కూడా భారత్ వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకుంది. ఈ ఐదు దేశాలు సహా భారత్‌కు చెందిన మొత్తం జీడీపీని లెక్కిస్తే అది ప్రపంచ మొత్తం జీడీపీలో సుమారు 50 నుంచి 55 శాతం వరకు ఉంటుంది. కేవలం భారత్, యూరోపియన్ యూనియన్ వాటానే ప్రపంచ జీడీపీలో 25 శాతంగా ఉంది. గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎదుగుతున్న శక్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ వియత్నాం, థాయ్‌లాండ్‌లతో పోలిస్తే గొప్ప పోటీతత్వాన్ని కల్పించనుంది. ప్రస్తుతం అమెరికా విధించిన కొత్త నిబంధనల ప్రకారం... బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాం 20 శాతం, థాయిలాండ్‌పై 19 శాతం టారిఫ్‌లు ఉన్నాయి. కానీ భారత్‌కు ఇది కేవలం 18 శాతానికి తగ్గడం వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, యూరోపియన్ యూనియన్ ద్వితీయ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో నాల్గో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. బ్రిట్ కూడా టాప్ -5 ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతోంది. ఈ ప్రభావవంతమైన ఆర్థిక శక్తులన్నీ ఇప్పుడు భారత్‌తో దృఢమైన వాణిజ్య బంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో ఈ కూటమి వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉన్నట్టు లెక్కలు చూస్తున్నాయి. ఇవే కాకుండా, భారత్ ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, ఆసియాన్ దేశాలు, సార్క్ దేశాలు, మారిషస్, యూఏఈ , ఆస్ట్రేలియా వంటి దేశాలతో ప్రాంతీయ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కలిగి ఉంది.

# సర్వశక్తులు ఒడ్డుతున్న హస్తం పార్టీ



హైదరాబాద్, ఫిబ్రవరి 4, (న్యూస్ పల్స్) మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీ సర్వేలతో సర్వం పసిగట్టిందా.. అసలు ఈ సర్వేలు తమకి అనుకూలంగా ఉన్నాయా..? ప్రతికూలంగా ఉన్నాయా..? ఓ వైపు ప్రయివేట్ సంస్థల సర్వేలు,మరోవైపు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ సర్వేలలో ఎక్కడ ద్విముఖ పోరు ఉండనుంది? ఎన్ని స్థానాల్లో త్రిముఖ పోరు ఉంటుంది...కొన్ని స్థానాల్లో నేతలకు సీఎం డైరెక్ట్ కాల్ చేసి భరోసా ఇవ్వడంలో మతలబు ఏంటి..? ఇంతకీ మున్సిపోల్స్ హస్తంపార్టీ హస్తగతం అయ్యేనా..?..కాంగ్రెస్ నేతలు ముస్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెంచుతున్నారు. హస్తం నేతలు నాలుగు ప్రయివేట్ సంస్థలతో చేయించిన సర్వే రిపోర్టులు అందినట్లు సమాచారం. ప్రయివేట్ సంస్థల రిపోర్టులతో పాటు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ రిపోర్టులను అధ్యయనం చేసిన హస్తం నేతలు తాము అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యే అవకాశం ఉందని ధీమాగా ఉన్నారు. విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడిపిన సీఎం రేవంత్ సైతం తెలంగాణకి రావడంతోనే సర్వే రిపోర్టులు పరిశీలించినట్లు సమాచారం. రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నాయని, ఎలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటే తొంభై శాతం స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవచ్చని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం..సర్వే రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నప్పటికీ పలు విషయాల్లో హస్తం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఉత్తర తెలంగాణలో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడైనట్లు తెలుస్తోంది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతం కావడంతో పాటు అర్బన్ ప్రాంతంలో హిందుత్వ ప్రభావం ఉండడంతో ఉత్తర తెలంగాణలోని పలు మున్సిపాలిటీలలో బీజేపీకి అనుకూలంగా ఉంది. ఆ స్థానాల్లో త్రిముఖ పోరు ఉండనున్నట్లు హస్తం నేతలు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ ఉన్న దగ్గర ఏవిధంగా ప్రచారం చేయాలో సీఎం రేవంత్ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. మైనార్టీ ఓటు బ్యాంకు కాంగ్రెస్ కు పడే విధంగా చూడడంతో పాటు, హిందుత్వ ఓటు బ్యాంకు చీలకుండా ఉండేందుకు సీఎం రేవంత్ కొత్త ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలను నేతలకు వ్యక్తిగతంగా కాల్ చేసి వివరించడానికి సీఎం సిద్ధమైనట్లు సమాచారం..దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడింది. ఈ ప్రాంతంలో దాదాపుగా ద్విముఖ పోరు ఉంటుందని హస్తం నేతలు అంచనా వేశారు. ఈ స్థానాల్లో గత పదేళ్లలో కేసీఆర్ చేసిన వైఫల్యాలను ఎండగట్టేలా ప్రచార వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఇక పార్టీకి ఇబ్బందిగా ఉన్న నియోజవర్గాల లిస్ట్ కూడ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో లోకల్ గా ఉన్న సమస్యలను గుర్తించి దానికి అనుగుణంగా మేనిఫెస్టో సిద్ధం చేయాలని సీఎం రేవంత్ సూచించినట్లు సమాచారం. వాయిస్..నాయకుల మధ్య అంతర్గత పోరు, ఆధిపత్య ఇబ్బందులున్న నియోజకవర్గాలను సైతం ప్రత్యేకంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఆయా నియోజవర్గాల నాయకుల మధ్య సమన్వయం కుదిర్చే బాధ్యతను పలువురు సీనియర్ నేతలకు సీఎం రేవంత్ అప్పగించారు. ఆ నేతలు సీఎం రేవంత్ దూతగా ఆయా నియోజకవర్గాలకు వెళ్లి నేతలతో మాట్లాడి వారి మధ్య సమన్వయం కుదిర్చి రావాలని సీఎం రేవంత్ ఆదేశించారు. సర్వేలు అనుకూలంగా ఉన్నాయి కదా అని నేతలు రిలాక్స్ అయితే ఊరుకునేది లేదని సీఎం వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఎన్నికలు ముగిసి మున్సిపల్ చైర్మన్ల, మేయర్ల ఎన్నిక జరిగేదాక కీలక నేతలంతా నియోజకవర్గాల పరిధిలోనే ఉండాలని సీఎం ఆదేశించారు.

## మణిపూర్ కొత్త సీఎంగా కేమ్‌చంద్



ఇంపాల్, ఫిబ్రవరి 4, (న్యూస్ పల్స్)మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాష్ట్రపతి పాలన త్వరలో ముగియనుంది. ఈ ఈశాన్య రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ ఎన్నికయ్యారు. కుకీ, మైతీ జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిన రాష్ట్రంలో, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. బీరేన్ సింగ్ సహా ఐదుగురి పేర్లు పరిశీలించిన తర్వాత కేమ్‌చంద్‌ను అధిష్ఠానం ఎంపిక చేసింది. దీంతో ఆయన మణిపూర్‌కు రెండో బీజేపీ సీఎం కానున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. ఈశాన్య రాష్ట్రంలో మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతోన్న రాష్ట్రపతి పాలన త్వరలోనే ముగిసి, ప్రజాస్వామ్య ప్రభుత్వం అధికారం చేపట్టనుంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ (62) ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కేమ్‌చంద్‌ను తమ నాయకుడిగా బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నకున్నారు. రెండేళ్లకుపైగా కుకీ, మైతీ తెగల మధ్య ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో ఏడాది కిందట ముఖ్యమంత్రి పదవికి బీరేన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనుండగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా కేమ్‌చంద్‌కు అవకాశం కల్పించింది. మణిపూర్ రాష్ట్రానికి రెండో బీజేపీ సీఎం కాబోతున్నారు. సీఎం రేసులో బీరేన్ సింగ్ సహా ఐదుగురు పేర్లు వినిపించగా.. కేమ్‌చంద్‌వైపు అధిష్ఠానం మొగ్గుచూపింది. మే 2023లో మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణలతో మణిపూర్‌లో హింస చెలరేగి వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులు కాగా.. ఆస్తులు భారీ ఎత్తున ధ్వంసమయ్యాయి. న్యూఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు సమావేశమై మణిపూర్ కొత్త సీఎం ఎంపికపై చర్చించారు. అనంతరం ఇంఫాల్‌లో జరిగిన బీజేపీ లేజిస్లేటివ్ పార్టీ సమావేశంలో మాజీ స్పీకర్ అయిన కేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. ఇక, కేమ్‌చంద్ సింగ్జామై నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి 2017 ఎన్నికల్లో గెలిచిన ఆయనకు స్పీకర్ పదవి వరించింది. ఐదేళ్ల పాటు పూర్తికాలం స్పీకర్‌గా కొనసాగారు. మళ్లీ 2022 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించారు. మణిపూర్‌లో ప్రస్తుతం పరిస్థితులు చక్కబడినట్టు పైకి కనిపిస్తున్నా.. పది రోజుల కిందట తన భార్యను చూసేందుకు నేపాల్ నుంచి వచ్చిన మైతీ వ్యక్తిని దారుణంగా కాల్చి చంపారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. భార్యతో సంతోషంగా గడుపుతున్న అతడ్ని.. ముసుగులు ధరించి వచ్చిన కొందరు దుండగులు విచక్షణారహితంగా కాల్చి చంపారు.

## నకిలీ ఎస్‌ఐగా సైబర్ బెదిరింపులు

**--15 లక్షల మోసం-ఇద్దరి అరెస్ట్-**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 04 – నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ పర్యవేక్షణలో కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.హనుమంత్ నాయక్ నేతృత్వంలో సైబర్ నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు సోషల్ మీడియాలో మహిళల ఫోటోల వద్ద కామెంట్ల ద్వారా బాధితుల ఫోన్ నంబర్లు సేకరించి, తాము ఎస్‌ఐలమని చెప్పి బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలువురి నుంచి విడతల వారీగా మొత్తం రూ.15 లక్షలు ఫోన్ పే మరియు బ్యాంకు ఖాతాల ద్వారా వసూలు చేసినట్లు గుర్తించారు. ఈ



కేసులో కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లో సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. ఇంకా కొంతమంది బాధితులు ఉండే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ తరహా మోసాలకు గురైన వారు సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు లేదా ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు జరిగితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. తక్షణ ఫిర్యాదుతో మోసపోయిన డబ్బును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేయడం, నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 04 :మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆహ్వానపత్రికలు, గోడ పత్రికలకు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం తొలి ఆహ్వానపత్రికను స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి గారికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి గారు అందజేశారు. ఈ సందర్భంగా వేదపండితులు, ప్రధానార్చకులు ఆశీర్వచనాలు అందించారు. మహానంది శ్రీ మహానందీశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తుల కిటకిటలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే ముఖ్య కార్యక్రమాలు ఈ విధంగా ఉంటాయని తెలిపారు. 13వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ, ధ్వజారోహణం14వ తేదీన శేష వాహన సేవ, సింహ వాహన సేవ15వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కాల అభిషేకం అనంతరం మహానందీశ్వర దంపతులకు కళ్యాణోత్సవం16వ తేదీన ఉదయం అశ్వ వాహన సేవ, రాత్రి పుష్ప పల్లకి సేవ17వ తేదీన మహా రథోత్సవం, పుష్ప శయనోత్సవం18వ తేదీన పూర్ణాహుతి, తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానందీశ్వర స్వామిని దర్శించుకుని పుణ్యఫలాలు పొందాలని వేదపండితులు కోరారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.. సిఐటియు

విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మె నోటీసులులేబర్ కోడ్స్ రద్దు- కార్మిక హక్కుల పరిరక్షణ కొరకు ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు బి.మాణిక్యం శెట్టి,టి.శివరాం,ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు బి.వెంకటేశ్వరమ్మ ఆశాలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కొత్తపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ సల్మాఖాతుమ్ కి పాతపేట ఆరోగ్య కేంద్రం నందు డేటా ఎంట్రీ ఆపరేటర్ అబ్దుల్ కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు నక్కీ శ్రీకాంత్,సీనియర్ నాయకులు పి.రామాంజనేయులు, మండల కో కన్వీనర్ బి.నాగమద్దయ్య పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని,ఆశాలు,కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ తో పాటు స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని,కనీస వేతనాలు 26 వేల రూపాయలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని,ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను, కార్మిక కక్షక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని కార్మిక హక్కులను కాపాడాలని కార్మిక వర్గం పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకళ,టి.లక్ష్మి,కె.లక్ష్మి,భారతి,ప్రవల్లిక,రాధిక,సుశీలమ్మ,విజయలక్ష్మి, శ్రీదేవి,కుల్లాయమ్మ,చంద్రకళ,లావణ్య, పుల్లమ్మ,లక్ష్మీదేవి,సునీత,రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్ టాక్స్ కట్టకపోతే జరిమానా తప్పదు...

**ఎంవిఐ క్రాంతి కుమార్**

విభారె న్యూస్ డోంట్ నో ప్రతినిధి:-డోన్ మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామం దత్తాత్రేయ స్వామి గుడి సమీపంలో టిప్పర్ వాహన దస్తావేజులను తనిఖీ చేయగా రోడ్ టాక్స్ రెండు సంవత్సరాల నుంచి కట్టకుండా తిరుగుతున్నందున 2 లక్షల 45 వేల రూపాయలు జరిమానా విధించి ఆర్టీసీ డిపోకుతరలించడం జరిగిందని డోన్ ఎంవిఐ క్రాంతి కుమార్ తెలిపారు

# మరో వివాదంలోమంచు ఫ్యామిలీ



తిరుపతి, ఫిబ్రవరి 4, మంచు మోహన్ బాబు, మంచు విష్ణు మరోసారి వార్తల్లోకి ఎక్కారు. తిరుపతి లో మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ ఎఫ్ ఐ సంఘం వాళ్ళను కిడ్నాప్ చేయించారని మోహన్ బాబు, మంచు విష్ణు, సతీష్ లపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. రీసెంట్ గానే రేణిగుంట విమానాశ్రయం లో పోలీసులు సతీష్ ని అదుపులోకి తీసుకున్నారు. మరి ఇప్పుడు మోహన్ బాబు, మంచు విష్ణులను కూడా అదుపులోకి తీసుకుంటారో లేదో చూడాలి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మోహన్ బాబు యూనివర్సిటీ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చాలా కాలం నుండి ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు చిన్న తనయుడు మంచు మనోజ్ కూడా ఈ విషయం పై పెద్ద పోరాటమే చేసాడు. కొట్లాట వరకు వెళ్లి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే రీసెంట్ విద్యార్ధి సంఘాలు కూడా మోహన్ బాబు యూనివర్సిటీ ఎదుట ధర్నాలు చేయడం మొదలు పెట్టాయి. విద్యార్థుల నుండి అన్యాయంగా అధిక ఫీజులు వసూలు చేసారని, తక్షణమే వాళ్లకు ఆ ఫీజులను తిరిగి చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు తన బౌన్సర్ల చేత వాళ్ళను కిడ్నాప్ చేయించినట్టు తెలుస్తోంది. కారులో వచ్చిన మోహన్ బాబు బౌన్సర్లు సినీ ఫక్కీలో విద్యార్థుల సంఘాల నేతలను ఎక్కించుకొని, మోహన్ బాబు ఫామ్ హౌస్ లో బంధించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మోహన్ బాబు ఫామ్ హౌస్ కి వెళ్లి విద్యార్థుల సంఘం నేతలను విడిపించి బౌన్సర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యవహారం పై మోహన్ బాబు ఎలాంటి రెస్పాన్స్ కూడా ఇవ్వలేదు. విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మోహన్ బాబు పట్టించుకోకపోవడం తో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యం లో వాళ్ళ బాధను అర్థం చేసుకున్న ఎస్ఎఫ్ఐ సంఘం, మరియు ఇతర విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీ వద్ద ధర్నా చేపట్టి విద్యార్థుల బాధని మోహన్ బాబు కి అర్థం చేసే ప్రయత్నం చేశారు. అలాంటి వాళ్లకు సర్దిచెప్పి పంపాల్సింది పోయి, అహంకారంతో ఇలా కిడ్నాప్ చేయడం అమానుషం అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# వైసీపీకి వరుస షాకులు



నెల్లూరు, ఫిబ్రవరి 4, ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి. తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు. మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు. మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు. ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.

# ఆ మూడు సీట్లు దక్కేదెలా

విజయవాడ, ఫిబ్రవరి 4,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఒక లోటు ఉంది. రాష్ట్రమంతటా గెలిచామని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ఓ మూడు చోట్ల మాత్రం ఆ పార్టీకి ఇప్పటివరకు విజయం దక్కలేదు. జగన్ ప్రభంజనంలో సైతం ఆ మూడు చోట్ల టిడిపి విజయం సాధించింది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాల ప్రయోగాలు చేసింది. కానీ ఆ ప్రయోగాలు ఏవి ఫలించలేదు. ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చింది. ఆ మార్పు ఎంతవరకు కూడా లాభం చేకూర్చలేదు. పైగా ఎంపీలుగా పోటీ చేసిన వైసీపీ నేతలకు అడ్రస్ లేకుండా పోయింది. రాజకీయ జీవితం లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నుంచి పోటీ చేసిన ముగ్గురు నేతలు వైసీపీలో లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరూ చిక్కడం లేదు. విజయవాడలో పోటీ అంటేనే నేతలు భయపడిపోతున్నారు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థి అవుతారని భావించి.. పారిశ్రామికవేత్త కోనేరు ప్రసాద్ ను రంగంలోకి దించింది. అంతకు ముందు రెండు ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించింది. కానీ వైసీపీ లెక్కలు తప్పాయి. టిడిపి అభ్యర్థి కేసినేని నాని ఘనవిజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల తరువాత కోనేరు ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు. 2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే అప్పట్లో కూడా విజయవాడ పార్లమెంటు స్థానం దక్కించుకోలేకపోయింది. రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేసినేని నాని ఇక్కడ ఘనవిజయం సాధించారు. ఆర్థిక బలం ఉన్న పొట్లూరు వరప్రసాద్ ను రంగంలోకి దించింది. ఆయన ప్రముఖ నిర్మాతగా కొనసాగుతుండగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు జగన్. అయితే రాష్ట్రమంతటా ప్రభంజనం వీచింది కానీ .. విజయవాడలో మాత్రం టిడిపి అభ్యర్థి కేసినేని నాని గెలిచి పట్టు నిలుపుకున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పొట్లూరు వరప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. క్రమేపి రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు. 2024 ఎన్నికల్లో అనూహ్యంగా రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అంతకుముందు రెండుసార్లు గెలిచేసరికి అదంతా తన చరిష్మ అన్నట్టు భావించారు. అయితే ఆయన పై టిడిపి అభ్యర్థిగా తమ్ముడు కేసినేని చిన్ని పోటీ చేసి గెలిచారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. అయితే విజయవాడలో పోటీ చేస్తున్న వారంతా ఇలా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ గా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

# మళ్లీ...బూతులతో రాజకీయాలు


గుంటూరు, ఫిబ్రవరి 4, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికల విజయం తర్వాత అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాల్సిన సమయంలో.. వీధుల వెంట జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు రాష్ట్ర భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌ల చుట్టూ తిరుగుతున్న తాజా పరిణామాలు ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తున్నాయి. నిన్న అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాల్సింది పోయి, బూతులతో కూడిన విమర్శలు చేయడం ఖచ్చితంగా గర్హనీయం. దీనిపై టీడీపీ శ్రేణులు భగ్గుమనడం సహజమే అయినప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఆయన ఇంటిపై దాడి చేయడం సమర్థనీయం కాదు. పోలీసులు రంగప్రవేశం చేసి అంబటిని అరెస్ట్ చేయడంతో ఆ వివాదం ముగిసిందనుకున్న తరుణంలో, నేడు మరో కొత్త మంట రాజుకుంది. మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ చేసిన విమర్శలను సాకుగా చూపి టీడీపీ శ్రేణులు ఆయన ఇంటికి నిప్పు పెట్టడం అత్యంత దారుణమైన విషయం. అంబటి చేసిన వ్యక్తిగత దూషణలతో పోలిస్తే, జోగి రమేశ్ చేసినవి రాజకీయ విమర్శలుగానే పరిగణించవచ్చు. కానీ, చిన్న విమర్శను కూడా సహించలేక ఇళ్లకు నిప్పు పెట్టే స్థాయికి రాజకీయాలు దిగజారడం ఆందోళనకరం. “వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలపై విసుగు చెందే ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. మళ్ళీ అదే పద్ధతులను టీడీపీ కేడర్ అనుసరిస్తే.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏముంటుంది?” అనే ప్రశ్న ఇప్పుడు సామాన్య ప్రజల నుంచి వినిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవజ్ఞుడు, సంయమనం పాటించే వ్యక్తి. ఆయన ఎప్పుడూ అభివృద్ధి, వ్యవస్థల ప్రక్షాళన గురించి మాట్లాడుతుంటారు. అయితే, పార్టీ కేడర్ మాత్రం నాయకుడి మౌనాన్ని ‘చేతగానితన ం’గా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. “మాపై దాడులు జరిగినప్పుడు మేం భరించాం, ఇప్పుడు మా టైమ్ వచ్చింది” అనే పగతో రగిలిపోతున్న కేడర్, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పితే, పెట్టుబడులు రావు సరి కదా.. ఉన్న కంపెనీలు కూడా తరలిపోయే ప్రమాదం ఉంది. కేడర్ చేసే ఇటువంటి పనులు చివరకు ప్రభుత్వంపైనే మచ్చ తెస్తాయి. ఇది కేవలం ఒక పార్టీ కార్యకర్తల ఉద్రేకం మాత్రమే కాదు, రాష్ట్ర ప్రతిష్టకు సంబంధించిన అంశం. ఈ విషయంలో చంద్రబాబు, లోకేశ్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, అరాచకాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని కఠిన సందేశం పంపాలి. గత ప్రభుత్వ అవినీతిపై లేదా దాడులపై విచారణ జరిపి, చట్టబద్ధంగా శిక్షించాలే తప్ప వీధి పోరాటాలు పరిష్కారం కావు. ప్రతిపక్షాలు కూడా నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. బూతు పురాణాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం వల్ల నష్టపోయేది వారే అని గ్రహించాలి. ప్రజలు మార్పును కోరుకుని ఓటేశారు. ఆ మార్పు అభివృద్ధిలో, పరిపాలనలో కనిపించాలే తప్ప దాడులలో కాదు. రాష్ట్రం వల్లకాడు కాకుండా ఉండాలంటే, ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని అరాచక శక్తులపై మోపాలి. అది ప్రతిపక్షమైనా, స్వపక్షమైనా సరే! శాంతియుత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు పాలకుల భుజస్కంధాలపై ఉంది.

# ఇక బెంగళూరు ఆరుగంటలే

కర్నూలు, ఫిబ్రవరి 4,ఏపీలో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి ఇటీవల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కనెక్టివిటీకి సంబంధించి ప్రాజెక్టులపై ఆరా తీశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో 167కే హైవే పనులు వేగవంతం చేశారు. ఈ నేషనల్ హైవే అందుబాటులోకి వస్తే బెంగళూరు తర్వగా వెళ్లొచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో బెంగళూరుకు కనెక్ట్ చేసే కీలకమైన నేషనల్ హైవే (167కే) పనులు స్పీడ్ అందుకున్నాయి. ప్రస్తుతం నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 62 కిలో మీటర్ల హైవే పనులు చేపట్టారు.. అక్కడి నుంచి జమ్మలమడుగు కడప రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే.. 60 నుంచి 65 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని.. బెంగళూరుకు 6 గంటల్లోపు వెళ్లొచ్చంటున్నారు. ఈ జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల చేశారు.. మొత్తం 486 ఎకరాల భూమిని సేకరించారు. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లోని (కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, నంద్యాల, సంజామల, గోస్పాడు) 22 గ్రామాల మీదుగా వెళుతోంది. మూడుచోట్ల బ్రిడ్జిలు.. అలాగే 158 చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ హైవేలో నాలుగు ప్రాంతాల్లో బైపాస్‌లు (కోవెలకుంట్ల, రైతునగరం, నొస్సం, గోస్పాడు) కూడా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు.

# కాపు సామాజికవర్గం కోసం...

ఏలూరు, ఫిబ్రవరి 4,2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం



వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు. చరిత్రను చూస్తే కాంగ్రెస్? టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది. ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్లనాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు. ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలో కూడా పుకార్లు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో కూటమి ఐక్యత బలంగా ఉండటంతో ఎదురీదడం కష్టమని భావిస్తున్న కొందరు నేతలు కొత్త దారులు వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో వైసీపీ ఈ పరిస్థితిని ఎలా మార్చుకుంటుందో చూడాల్సి ఉంది.

# రాజమండ్రి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో పెద్దపులి కలకలం

**ఎస్వీపీఎస్ ఫంక్షన్ హాల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మధ్య ఉన్న కొబ్బరి తోటలోకి పెద్దపులి వెళ్లినట్లు గుర్తింపు సీసీ కెమెరాలో రికార్డయిన పెద్దపులి కదలికలుభయాందోళనలకు గురవుతున్న ప్రజలు**

ఇంత వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతాన్ని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఫిబ్రవరి 1న రాజమండ్రి రూరల్ పరిధిలోని తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపిన ఘటన కూడా కలకలం రేపింది. ఆ ఘటనపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే వారి వెనకాలే పెద్దపులి కనిపించడం ఆందోళనను మరింత పెంచింది. పులి సంచారంపై అటవీ శాఖ అప్రమత్తమైంది. రాజమహేంద్రవరం సర్కిల్ సీసీఎఫ్ బి.ఎన్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో డీఎఫ్‌వో ప్రభాకరరావు, ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, డీఆర్‌వో శ్రీనివాస్‌రావు, రాష్ట్ర సిల్వికల్చరిస్ట్ ఆర్.శ్రీనివాసరావు తదితర అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పులిని పట్టుకునేందుకు పూణేలోని నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని, బుధవారం ఉదయానికి వారిని రాజమహేంద్రవరం రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## 8వ తేదీ ఆదివారం భానుసప్తమి సందర్భంగా సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ ఫిబ్రవరి 4 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో సూర్యనారాయణ స్వామి



దేవాలయంలో ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ నారాయణస్సం సిజాసన సన్నివిష్టఃకేయూరవాన్ మకర కుండలవాన్ కిరీటీహారీ హిరణ్మయవపుః ధృత శంఖచక్రః లోక కళ్యాణం విశ్వశాంతి కాంక్షిస్తూ శ్రీ సూర్య నారాయణ స్వామి దివ్య సన్నిధిలో మాఘ మాసంలోరానున్న భానుసప్తమి అనగా ది. 8-02-2026, మహా పర్వదినం సందర్భంగా ఉదయం గం? 7-30 ని? ల నుండి మధ్యాహ్నం 12-00 గం? ల వరకు త్రిచ,మహాసౌర, అరుణ పూర్వకముగా సూర్య మండల ఆరాధన, సూర్య నమస్కారములు, శ్రీ మహా గణపతి, అరుణ హోమము శాస్త్రోక్తంగా నిర్వహించబడును. ఆయువు, ఆరోగ్యము, ఐశ్వర్యమును అనుగ్రహించే శ్రీ సూర్య నారాయణ స్వామి వారిని అర్చించే ఈ విశేష కార్యక్రమాలలో అందరూ పాల్గొనగలరు.యంత్ర ఆరాధన: 1000అరుణ హోమం: 2500ఆరాధన,హోమం సంకల్పం :516సూర్య అర్ఘ్యప్రదానం :116అనంతరం భక్తులందరూ స్వామివారి ప్రసాదము స్వీకరించి శ్రీ సూర్య నారాయణ స్వామి కృపకు పాత్రులుకాగలరు.ఓం సూర్యాయ నమఃసంప్రదించవలసిన98668002207981012787ఫోన్ పే గూగుల్ పే నెంబరు.8896123777ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు.. 08518-234388..

## ఔత్సాహిక పరిశ్రమలకు ప్రోత్సాహం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 04 :-జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు.సింగిల్ డెస్క్ విధానం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 491 దరఖాస్తులు అందగా, 474 పరిశ్రమలకు అనుమతులు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 17 దరఖాస్తులను సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఉత్పాదన మరియు సేవా రంగాలకు చెందిన 07 పరిశ్రమల యూనిట్లకు రూ.34.30 లక్షల రాయితీలను కమిటీ ఆమోదించినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మెప్మా పీడీ వెంకటదాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 04-బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నంద్యాల ఐఎంఏ, నంద్యాల రోటరీ క్లబ్, మహిళా వైద్య విభాగం, రోటరీ ఇన్నర్ వీల్ సహకారంతో క్యాన్సర్‌పై ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఉదయానంద ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీని ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్ కరపత్రాలు ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రిలో ప్రతి శనివారం నిర్వహించే ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షల కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సాయి ప్రణీత్, డాక్టర్ సుస్మిత, డాక్టర్ కుషాల్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమన్నారు.రోటరీ ప్రతినిధులు క్యాన్సర్ పరీక్షలకు ఉపయోగపడే పరికరాలను ఆసుపత్రికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఐఎంఏ, రోటరీ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




## ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత..

### - కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్...

విభారే న్యూస్ ఫిబ్రవరి 4 కర్నూలు జిల్లా ప్రతినిధి..1200 మంది పోలీసులతో భారీ బందోబస్తు.పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.ఏర్పాట్ల పై ఆరా తీసి పరిశీలించిన కర్నూలు ఎస్పీ.2026 ఫిబ్రవరి 6 న (శుక్రవారం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎమ్మిగనూరు మండలం,కలుగొట్ల గ్రామంలో



పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో హెలిప్యాడ్, ప్రజావేదిక ఏర్పాట్లను కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి , కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ భద్రత ఏర్పాట్లను బుధ వారం పరిశీలించారు.ముఖ్యంత్రి హెలిప్యాడ్,పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఇతర భద్రత ఏర్పాట్ల గురించి ఆరా తీశారు.సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.పటిష్ఠ భద్రత కు పోలీసు బందోబస్తు ఏర్పాట్ల గురించి మాట్లాడారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సంయుక్తంగా రెవిన్యూ,పోలీసులు ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే రూట్, రూఫ్ - టాప్ ప్రాంతాలలో,సిఎం కాన్వాయ్,సభ ప్రాంగణం,తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగీలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు,పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. కర్నూలు,కడప,నంద్యాల, అన్నమయ్య జిల్లాల పోలీసులను బందోబస్తు విధులకు కేటాయించారు.ఇందులో జిల్లా ఎస్పీతో పాటు ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 8 మంది డిఎస్పీలు,55 మంది సిఐలు, 88 మంది ఎస్సైలు,297 మంది ఎఎస్సైలు / హెడ్ కానిస్టేబుళ్ళు,485 మంది కానిస్టేబుళ్ళు,61 మంది మహిళా పోలీసులు,191 మంది హోంగార్డులు,2 సెక్షన్ల ఎఆర్ పోలీసులు, 14 స్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించారు.జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లతో పాటు సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి, హోంగార్డు డిఎస్పి ప్రసాద్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు,టీడీపీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణమ్మ ,సిఐలు,ఎస్సైలు ఉన్నారు.

## చెత్త రహిత నంద్యాలే లక్ష్యం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 04-నంద్యాల పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా



బుధవారం చిన్న చెరువు కట్టపై విస్తృత స్థాయిలో శుభ్రత చర్యలు చేపట్టారు. నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశాల మేరకు శానిటరీ అధికారి శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది చెత్త చెదారం తొలగింపు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మున్సిపల్ అధికారులు సూచించారు. పట్టణాన్ని శుభ్రంగా సుందరవంతంగా తీర్చిదిద్దాలంటే ప్రజల సహకారం తప్పనిసరి అని తెలిపారు. రోడ్లపై, కాల్వలపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా డస్ట్ బిన్నుల్లోనే వేయాలని కోరారు.కాల్వల్లో కసువు, ప్లాస్టిక్ వ్యర్థాలు, నీటి బాటిళ్లు వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని అధికారులు వివరించారు. మురుగు నీరు బయటకు వెళ్లలేక రోడ్లపై ప్రవహించి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన పట్టణం-పట్టణ సుందరీకరణ ప్రజల చేతుల్లోనే ఉందని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచినపుడే దోమల వ్యాప్తిని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి శుభ్రమైన నంద్యాల నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## నేడు సంకష్ట చతుర్థి సందర్భంగా సూర్య దేవాలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ ఫిబ్రవరి 4 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో వరసిద్ధి వినాయక స్వామి వారికి సంకష్టహర చతుర్థిప్రదోష పూజ 05/02/2026, గురువారము నాడు నిర్వహించబడును.వరసిద్ధి వినాయక స్వామి వారిని పూజిస్తే అనుకున్న పనులు వెంటనే జరుగుతాయి ఏ కార్యం తలపెట్టిన విఘ్నాలు రావు, మీ జాతకం లో బుధ, కేతు గ్రహాలు కలిగించు ఆటంకాలు తొలగిపోయి శుభ ఫలితాలను ప్రసాదించును. అటువంటి స్వామి వారికి ఈ రోజున ఉదయం 10:30 గం"లకు లక్ష్మీ గణపతి మూల మంత్ర సహిత లక్ష్మి గణపతి హోమం జరుగును. సాయంకాలము 6:00 గంటలకు పంచామృత అభిషేకం,సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ జరుగును.ఇందు భక్తులు విశేషముగా పాల్గొని శుభ ఫలితాలు పొందగలరు. సమయపాలన పాటించగలరని మనవి.సంకటహర చతుర్థి ప్రదోష పూజ 200 /-హోమ



సంకల్పం 116 /- విశేషంగా ప్రధాన హోమం 2500/-వివరములకు సంప్రదించవలసిన నెం:-జి. ప్రద్యుమ్న కుమార్ శర్మ9440616198 ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777..


## ప్లాస్టిక్ కవర్లపై మున్సిపల్ ఉక్కుపాదం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 04-పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు మున్సిపల్ కమిషనర్ బి శేషన్న బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమించే వారిపై ఎలాంటి సడలింపులు ఉండవని ఆయన స్పష్టంగా తెలిపారు.పలు దుకాణాలు, వాణిజ్య సముదాయాలను స్వయంగా పరిశీలించిన కమిషనర్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వలన పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని, డ్రైనేజీ వ్యవస్థలు మూసుకుపోయి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతున్నదని పేర్కొన్నారు.ప్లాస్టిక్ కవర్లకు బదులుగా కాటన్, జ్యూట్, పేపర్ కవర్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించిన దుకాణాలపై జరిమానాలు, చట్టపరమైన చర్యలు కఠినంగా అమలు చేస్తామని తెలిపారు.ఈ తనిఖీల్లో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, లక్ష్మినారాయణతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వ్యాపారులు, ప్రజలు బాధ్యతగా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న కోరారు.



## వడ్డీ లేని మహిళా రుణ పథకం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి-04 :నంద్యాల నియోజకవర్గ మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణ పథకం త్వరలో



ప్రారంభం కానుంది.నంద్యాల పట్టణంలోని ప్రతి వార్డు నుంచి 25 మంది మహిళలను ఎంపిక చేసి, ఒక్కో వార్డుకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతి గృహిణీలు స్వయం ఉపాధి సాధించి కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా చేయడమే లక్ష్యమన్నారు.మహిళల్లో ఉన్న ప్రతిభకు ఆర్థిక సహకారం లభిస్తే వారు మరింత ముందుకు వస్తారని పేర్కొన్నారు.ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాల కోసం నంద్యాల నూనెపల్లె, కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న సాయి ఆనంద నిలయం కాంప్లెక్స్, ఫస్ట్ ఫ్లోర్, 4వ నంబర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## జన ఔషధి మెడికల్ షాప్ పరిశీలన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 04:నంద్యాల జిల్లా ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కానున్న ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్ షాప్‌ను జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ జి. రాజకుమారి బుధవారం పరిశీలించారు.మెడికల్ షాప్ ప్రారంభానికి అవసరమైన గదులు, సామాగ్రి, ఏర్పాట్లను ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు. పనులను వేగవంతం చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నాణ్యమైన మందులను తక్కువ ధరకే ప్రజలకు అందించేందుకు ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్ షాపులు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఈ మెడికల్ షాప్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా సెక్రటరీ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జిలాని భాష, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, రెడ్ క్రాస్ డీఎఫ్ఓ సమీ, ఫార్మసిస్టు ఇంద్రజ, మున్సిపల్ ఇంజనీర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## హెవీ వాహన లైసెన్స్ సాధించిన తొలి మహిళ లక్ష్మి దేవి--

### కలెక్టర్ జి. రాజకుమారి గణియా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఫిబ్రవరి 04 :నంద్యాల జిల్లాలో హెవీ వాహన డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తొలి మహిళగా లక్ష్మీదేవి అరుదైన ఘనత సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆమెను హృదయపూర్వకంగా అభినందించారు.బుధవారం కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆటో డ్రైవింగ్ స్థాయి నుంచి ప్రారంభించి



ఏట్టుదల, క్రమశిక్షణతో లారీ, బస్సు వంటి భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసి లైసెన్స్ పొందడం అభినందనీయం అన్నారు. ఇది జిల్లాలోని మహిళలకు గర్వకారణమని పేర్కొన్నారు.పురుషాధిక్యంగా భావించే రంగాల్లోనూ మహిళలు ముందుకు రాగలరనే విషయాన్ని లక్ష్మీదేవి నిరూపించారని తెలిపారు. ఆమె విజయం యువతకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు.

## నేడు వేద గాయత్రి దేవాలయంలో 12 వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు..

### - పూజా కార్యక్రమాలన్నీయు ఆలయ అర్చకులు బలకుంది నరహరి శాస్త్రిచే నిర్వహించబడును..

విభారే న్యూస్ ఫిబ్రవరి 4 ఎమ్మిగనూరు..నేడు శ్రీ గాయత్రీ అమ్మవారి పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉదయము 6 గంటలకు అభిషేకము.తరువాత తొమ్మిది గంటల నుండి అమ్మవారికి విశేషంగా



ఫల పంచామృత అభిషేకము, 108 కొబ్బరి బోండాలతో అభిషేకము, సుమంగళీ ద్రవ్య అభిషేకము, సుగంధ ద్రవ్య అభిషేకము. శ్రీ లలితా సహస్రనామ పారాయణము అర్చన అలంకరణ నైవేద్యము ప్రసాద వితరణ. సాయంత్రం 6 గంటల నుండి అమ్మవారికి విశేష కుంకుమార్చన దేవతా సంకీర్తన స్తోత్ర పారాయణ మహా మంగళహారతి ప్రసాద వితరణ.ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆలయ అర్చకులు కోరారు..

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**